RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 243 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | గురువారం, 7 మార్చి 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# ఎక్కడ నెగ్గాలో కాదు ఎక్కడ తగ్గాలో...

## తెలిసినవాడే సిసలైన రాజకీయ నాయకుడు

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి తనదైన మార్క్ రాజకీయంతో ముందుకు కదులుతున్నట్లు తెలుస్తుంది. ఫైనల్ గా తెలంగాణ అభివృద్ధి ముఖ్యం.. ఈ విషయంలో కేంద్రంలో అధికారంలో ఉన్నవారితో కలిసి ప్రయాణం చేయడం ధర్మం.. అన్నట్లుగా ఆయన ప్రయాణం సాగుతుందని తెలుస్తుంది. ఇందుకు తాజాగా మోడీతో కలిసి వేదిక పంచుకోవడంతో పాటు ఆయనకు విమానాశ్రయంలో వీడ్కోలు ఇవ్వడం కూడా ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

దీంతో... పాలిటిక్స్ వేరు, అడ్మినిస్ట్రేషన్ వేరు అనే కోణంలో రేవంత్ ప్రయాణం సాగుతుందనే కామెంట్లు వినిపిస్తున్నాయి.

**మోడీకి ఆ మర్యాద ఇచ్చిన రేవంత్..!:** సాధారణంగా దేశ ప్రధాని తమ తమ రాష్ట్రాలకు వస్తున్నారంటే సొంత పార్టీ సీఎంలు నానా హడావిడీ చేస్తారు.. ప్రత్యర్థి పార్టీల సీఎంలు కొంతమంది సరిగా స్పందించకపోగా, కొంతమంది తూతూ మంత్రంగా స్పందిస్తుంటారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మోడీ హైదరాబాద్ వస్తే రిసీవింగ్ ఆయన స్థాయిలో ఉండేది కాదు! కొన్ని సందర్భాల్లో ఎవరొక మంత్రిని విమానాశ్రయానికి పంపి, ఒక పుష్పగుచ్ఛం ఇచ్చి వచ్చేవారు. అయితే రేవంత్ వచ్చాక ఈ ట్రెండ్ పూర్తిగా మారినట్లు కనిపిస్తుంది. ఇందులో భాగంగా... తన రెండు రోజుల పర్యటనలో భాగంగా తెలంగాణకు వచ్చిన మోడీ.. తిరిగి ఢిల్లీ వెళ్తున్న మోడీకి వీడ్కోలు పలికేందుకు రేవంత్ వ్యక్తిగతంగా హాజరయ్యారు. మోడీకి ఆత్మీయంగా జ్ఞాపికలు అందిస్తూ వీడ్కోలు పలికారు! దీనికి సంబంధించిన ఫోటోలు ఇప్పుడు వైరల్ గా మారాయి. ఇదే సమయంలో... తెలంగాణలో రేవంత్ సరికొత్తగా ముందుకు కదులుతున్నారనే కామెంట్లు వినిపిస్తున్నాయి.

**సీఎం రేవంత్ రెడ్డికి గుడి!:** తెలంగాణలో మాస్ లీడర్స్ లో రేవంత్ రెడ్డి ఒకరు! ఇంకా గట్టిగా చెప్పాలంటే... 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన అనంతరం రేవంత్ రేంజ్ ఒక్కసారిగా మారిపోయింది.

ఇప్పుడు తెలంగాణ మాస్ లీడర్స్ లో రేవంత్ టాప్ ప్లేస్ లో ఉన్నారన్నా అతిశయోక్తి కాదు. ఈ స్టేట్ మెంట్ బీఆరెస్స్ వర్గాలకు నచ్చకపోయినా ఇది నిజమనే వారే ఎక్కువ! ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డికి గుడి కట్టబోతున్నారనే మాట ఇప్పుడు వైరల్ గా మారింది. సూర్యాపేట వనిపాకల గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డికి గుడికట్టబోతున్నట్లు రెడ్డి సంఘం ప్రతినిధి మేడి సంతోష్ ప్రకటించారు. దీనికి సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమం మార్చి 19న జరగనుందని తెలిపారు. దీంతో... ఇప్పుడు ఈ విషయం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.

వాస్తవానికి బ్రతికున్న నేతలకు, సినిమా వాళ్లకు గుడి కట్టే సంస్కృతి ఎక్కువగా తమిళనాడులో ఉంటుందనేది తెలిసిన విషయమే. అయితే ఇటీవల కాలంలో తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సంస్కృతి ప్రారంభమవుతున్నట్లే కనిపిస్తుంది. ఈ క్రమంలో ఇటీవల ఏపీలోని బాపట్లలో సమంతకు ఒక ఫ్యాన్ గుడి కట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పుడు సీఎం రేవంత్ కు గుడి కట్టబోతున్నారు.



## రేవంత్ మార్క్ రాజకీయానికి ఇవి మచ్చుతునకలు!

## తెలంగాణ నుంచి లోక్‌సభకు రాహుల్: తమ్ముడికి షాకిచ్చిన రేవంత్: అభ్యర్థుల జాబితాపై క్లారిటీ



హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల గడువు సమీపించిన నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ దూకుడు ప్రదర్శిస్తోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని ఇక్కడా పునరావృతం చేయాలనే పట్టుదలతో ఉంది. దీనికి అనుగుణంగా వ్యూహాలను రూపొందించుకుంటోంది. తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. అత్యధికం బీఆర్ఎస్ ఖాతాలో ఉన్నాయి. తొమ్మిది స్థానాల్లో గులాబీ జెండా ఎగురుతోంది. నాలుగు చోట్ల బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. మరో మూడింటిని కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. ఏఐఎంఐఎం ఒక స్థానాన్ని నిలబెట్టుకుంది. లోక్‌సభలో బీఆర్ఎస్ ఆధిపత్యానికి గండి కొట్టాలని భావిస్తోంది కాంగ్రెస్. తన ఆధిపత్యాన్ని పెంచుకునే ప్రయత్నాల్లో ఉంది. అధిక లోక్‌సభ స్థానాలను తన ఖాతాలో వేసుకోవడానికి సంక్షేమ పథకాలను ముందుకు తీసుకొచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తోంది. ఇదే అంశంపై మీడియాతో చిట్‌చాట్ చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఈ లోక్‌సభ ఎన్నికలను తమ మూడు నెలల ప్రభుత్వానికి రెఫరెండంగా భావిస్తోన్నామని తేల్చి చెప్పారు. ఖచ్చితంగా అత్యధిక స్థానాలను గెలుచుకుంటామని, ఈ విషయంలో ఎలాంటి సందేహాలు అక్కర్లేదని అన్నారు. రాష్ట్రంలో ఉన్న 17 లోక్‌సభ స్థానాల్లో కనీసం 14 చోట్ల తాము విజయం సాధిస్తామంటూ ధీమా వ్యక్తం చేశారాయన. ముఖ్యమంత్రిగా ఈ మూడు నెలల కాలంలో తన పని తీరును చూసిన తెలంగాణ ప్రజలు.. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తారని, అదే జరగబోతోందనీ అన్నారు రేవంత్ రెడ్డి. భారతీయ జనతాపార్టీ- బీఆర్ఎస్ మధ్య అంతర్గత ఒప్పందాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ రెండు పార్టీల మధ్య గల సీట్ల మ్యాపింగ్‌ను పరిశీలించి చూస్తే- ఈ విషయం ఇట్టే అర్థమౌతుందని అన్నారు. బీజేపీ-బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయనేది అందరికీ తెలుసునని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో తన కుటుంబం నుంచి ఎవరూ పోటీ చేయబోరంటూ తేల్చి చెప్పారు రేవంత్ రెడ్డి. మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం నుంచి ఆయన తమ్ముడు కొండల్ రెడ్డి కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేయొచ్చంటూ వస్తోన్న వార్తలపై స్పందించారు. కుటుంబ సభ్యులతో పోటీ చేయించడానికి తానేమీ కేసీఆర్‌ను కాదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ నుంచి రాహుల్ గాంధీ లోక్‌సభకు పోటీ చేయాలని తాను కోరుకుంటోన్నానని రేవంత్ అన్నారు. భారీ మెజారిటీతో ఆయనను గెలిపించుకుంటామని చెప్పారు. ఇక్కడి నుంచి పోటీ చేయాలా? వద్దా? అనేది రాహుల్ నిర్ణయం మీద ఆధారపడి ఉంటుందని అన్నారు. ప్రధాని మోదీని పెదన్నయ్యగా అభివర్ణించడాన్ని సమర్థించుకున్నారు రేవంత్ రెడ్డి. అమెరికా లాంటి దేశాల్లో అధ్యక్షులను బిగ్ బ్రదర్‌గా సంబోధిస్తుంటారని గుర్తు చేశారు. ఓ ముఖ్యమంత్రిగా దేశ ప్రధానిని గౌరవించానని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎవరికి వారు తమకు తోచిన విధంగా అర్థాలను తీశారని నవ్వుతూ చెప్పారు. ఈ నెల 7 లేదా 8 తేదీన కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేస్తామని రేవంత్ రెడ్డి. గెలిచే వారికే టికెట్లు ఇస్తామని తేల్చి చెప్పారు. అభ్యర్థుల వడపోత తుదిదశలోఉందని వివరించారు. ఒకే దశలో లేదా రెండు దశల్లో అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు రాష్ట్రాన్ని దోచుకున్నారని, అందుకే తెలంగాణ సమాజం ఆ కుటుంబాన్ని రాజకీయంగా శిక్షించిందని రేవంత్ రెడ్డి అన్నారు. కరడుగట్టిన టెర్రరిస్ట్ కసబ్‌ను కూడా మన దేశం విచారించిందని, అలాంటిది కేసీఆర్‌కు కూడా మాట్లాడే అవకాశం ఇస్తామని చెప్పారాయన.

## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

న్యూఢిల్లీ, మార్చి 6: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు (గురువారం) ఢిల్లీకి వెళ్లనున్నారు. రేపు ఏఐసీసీలో జరిగే స్క్రీనింగ్ కమిటీ సమావేశానికి సీఎం హాజరుకానున్నారు.

రేపు తెలంగాణ లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కసరత్తును ఏఐసీసీ పూర్తి చేయనుంది. ఒకటి రెండు రోజుల్లో మెజారిటీ లోక్‌సభ స్థానాలను ఏఐసీసీ ప్రకటించనుంది. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ముగిసిన విషయం తెలిసిందే. మరోవైపు రేపే టీ



కాంగ్రెస్ కూడా ఎంపీ అభ్యర్థుల తొలి జాబితా విడుదల అయ్యే అవకాశాలు కనిపిస్తున్నా యి. అభ్యర్థుల ఎంపిక బాధ్యత రేవంత్‌కు అధిష్ఠానం అప్పజెప్పింది. ప్రస్తుత రాష్ట్ర పరిస్థితులను రేవంత్ హైకమాండ్‌కు వివరించనున్నారు. గెలుపు గుర్రాలకే సీట్లు ఇస్తామని హస్తం నేతలు అంటున్నారు. తొలి జాబితాలో సీటు దక్కించుకునేందుకు ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. తెలంగాణలో ఏకాభిప్రాయం ఉన్న సీట్లను రేపు ఏఐసీసీ ప్రకటించనుంది.




# మరో అద్భుతం ఆవిష్కృతం

## నీటి అడుగులో మెట్రో రైలు

## ప్రారంభించి... ప్రయాణించిన ప్రధాని మోదీ

కోల్ కతా: దేశంలో తొలి అండర్ రివర్ మెట్రో రైలును ప్రధాని మోదీ బుధవారం కోల్ కతాలో ప్రారంభించారు. కోల్ కతా ఈస్ట్ వెస్ట్ మెట్రో కారిడార్ కింద హుగ్లీ నది దిగువన రైలు మార్గాన్ని నిర్మించారు. ఇందుకోసం రూ.120 కోట్ల ఖర్చు చేశారు. కోల్ కతా ఈస్ట్ వెస్ట్ మధ్య 16.6 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని నిర్మించారు. 10.8 కిలోమీటర్లు భూగర్భంలో ఉంది. హావ్‌డా మైదాన్ నుంచి ఎస్‌ప్లెనెడ్ స్టేషన్ల మధ్య 4.8 కిలోమీటర్ల మేర ఉన్న లైన్‌లో భాగంగా 520 మీటర్ల పొడవు గల అండర్ వాటర్ మెట్రో టన్నెల్ నిర్మించారు. నదిలో ఈ దూరాన్ని మెట్రో రైలు 45 సెకన్లలో పూర్తి చేస్తుంది. ఈ సొరంగాన్ని నదీ గర్భానికి 16 మీటర్ల లోతులో, భూమి లోపలికి 32 మీటర్ల లోతులో నిర్మించారు. ఈ సొరంగం అంతర్గత వ్యాసం 5.5 మీటర్లుగా.. బాహ్య వ్యాసం 6.1 మీటర్లుగా ఉంది. హావ్‌డా నుంచి సీల్దాకు రోడ్డు మార్గంలో వెళ్లడానికి 90 నిమిషాల సమయం పడుతోంది. అండర్‌వాటర్ మెట్రో మార్గం ఏర్పాటుతో ఈ ప్రయాణ సమయం 40 నిమిషాలకు తగ్గనుంది. అండర్ వాటర్ మెట్రో రైలు నడిచే మార్గంలో మొత్తం ఆరు స్టేషన్లు ఉండగా.. అందులో మూడు భూగర్భంలోనే ఉన్నాయి. అండర్ వాటర్ మెట్రో రైలు ప్రయాణం కోల్‌కతా వాసులకు కొత్త అనుభూతిని కలిగించనుంది. కోల్‌కతా లోని మరిన్ని మెట్రో మార్గాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. హౌరా మైదాన్-ఎస్ప్లానేడ్ మెట్రో మార్గం, కవి సుభాస్-హేమంత ముఖోపాధ్యాయ మెట్రో మార్గం, తరటాలా-మజెర్‌హట్ మెట్రో మార్గం, రూబీ హాల్ క్లినిక్- రాంవాడి మెట్రో మార్గం వంటి తదితర మెట్రో లైన్‌లను ప్రధాని మోదీ ప్రారంభించారు. గత ఐదు రోజుల్లో రెండోసారి ప్రధాని మోదీ కోల్ కతా వచ్చారు. రూ.15,400 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు మోదీ శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత ఉత్తర 24 పరగణ జిల్లాలో గల బరాసత్ వద్ద బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. బరాసత్, సందేశ్ ఖాళి లోక్ సభ నియోజకవర్గ పరిధిలో ఉంటుంది. టీఎంసీ నేత షేక్ షాజహాన్ ఇష్యూకి సంబంధించి బెంగాల్‌లో రగడ నెలకొంది. ఈ క్రమంలో ప్రధాని మోదీ బరాసత్‌లో ప్రసంగించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## హైకమాండ్ పెద్ద ఆశలు... ఏపీ బీజేపీ పొత్తు ఊసులు..!

ఎక్కడైనా నాయకత్వానికి నాయకులకు మధ్య చిన్నపాటి భేదాలు వస్తూ ఉంటాయి. ఎందుకంటే అధినాయకత్వం పై నుంచి చూస్తుంది. నాయకులు తమ పరిధిలో చూస్తారు. ఇపుడు ఏపీ బీజేపీకి జాతీయ నాయకత్వానికి మధ్య అలాంటిదే జరుగుతోంది అంటున్నారు. ఏపీ బీజేపీలో ఎక్కువ మంది నాయకులు టీడీపీ జనసేన కూటమితో పొత్తు పెట్టుకుని అలా ముందుకు సాగిపోదామనే అంటున్నారు. ఎందుకంటే వారి ఆలోచనలు వారివి. 2014లో ఒకసారి అలా పొత్తు పెట్టుకుంటే నాలుగు ఎమ్మెల్యే సీట్లు దక్కాయి. అందులో ఇద్దరికి మంత్రి పదవులు కూడా ఇచ్చారు. ఒకరిద్దరు ఎమ్మెల్సీలు తీసుకున్నారు. నాలుగేళ్ల పాటు టీడీపీతో బీజేపీ పొత్తు కలిపి ముందుకు సాగింది. ఆ నేపధ్యంలో ప్రభుత్వంతో పనులు కూడా చేయించుకున్నారు. ఒక విధంగా చెప్పలంటే అధికార దర్జా అనుభవించారు. కానీ ఆ తరువాత నుంచే సీన్ మారింది. పొత్తుల నుంచి టీడీపీ వేరు పడింది. దాంతో గత ఆరేళ్లుగా ఏపీలోని బీజేపీ ఎత్తిగిల్లలేదు. ఏమీ కాకుండానే ఉంది. 2019లో సొంతంగా పోటీ చేస్తే వచ్చినవి అర సున్నా శాతం ఓట్లు మాత్రమే. దాంతో బీజేపీకి చెందిన ఏపీ నేతలు చాలా మంది పొత్తు వైపు చూస్తున్నారు అని అంటున్నారు. ఈ అయిదేళ్లలో పార్టీ పెర్ఫార్మెన్స్ పెద్దగా ఏమీ లేదని మరోసారి ఇలాగే ఒంటరి పోరుకు వెళ్తే దెబ్బ తింటామని కూడా భయపడుతున్నారు. ఇక టీడీపీ జనసేన కూటమి అయితే కోరి పిలుస్తోంది అని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. అయితే కేంద్ర నాయకత్వం ఆలోచనలు మరోలా ఉన్నాయి. ఏపీలో ఈసారి కూడా వైసీపీ అధికారంలోకి వస్తేనే బీజేపీ ఎదుగుదల అన్నది సాధ్యపడుతుందని ఆ పార్టీ కేంద్ర వ్యూహకర్తలు ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. ఈసారి కూడా జగన్ గెలిస్తే 2029 నాటికి ఏపీలో టీడీపీ అన్నదే ఉండదని, టీడీపీ ప్లేస్ లోకి బీజేపీ చాలా సులువుగా చొచ్చుకుని పోవచ్చు అని వీలైతే అప్పటికి జనసేనతో కూడా కలసి తామే అధికారంలోకి రావచ్చు అన్నది కేంద్ర నాయకుల ఆలోచన అని అంటున్నారు. ఎప్పటికపుడు పరగడుపు అన్నట్లుగా ఏవో కొన్ని సీట్లు తీసుకుని ఒకటి రెండు మంత్రి పదవులతో అలా పక్కన ఉంటే ఏపీలో ఎప్పటికీ తాము బలపడేది ఉండదని కూడా భావిస్తున్నారు. మరో వైపు చూస్తే ఏపీలో బీజేపీకి రాజకీయంగా కూడా ఇపుడు నష్టం లేదు అని అంటున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినా ఆ పార్టీ ఎంపీలు కేంద్ర బీజేపీకి మద్దతుగానే ఉంటారు అని కూడా లెక్క వేసుకుంటున్నారు. అదే టీడీపీతో వెళ్తే ఆ పార్టీకి కొత్తగా ఊపిరి పోస్తే మాత్రం ఈ బలంతో మరో పదేళ్ల పాటు టీడీపీ పాతుకు పోతుందని, అపుడు బీజేపీకి ఏపీలో శాశ్వతంగా పార్టీ ఎదుగుదల అన్నది నిలిచిపోతుందని భయపడుతున్నారు. ఇప్పటిదాకా అంటే 1999 నుంచి కూడా ఏపీ బీజేపీ నేతల మాటలకే విలువ ఇస్తూ పొత్తులకు సిద్ధపడితే పార్టీని బాగు చేసుకోలేదని, అధికారం అండతో ఎక్కడా బలపడలేదని, ఇలా 1999, 2004, 2014లో ఏపీ లీడర్స్ కి ప్రాధాన్యత ఇచ్చామని వారి మాట విని పొత్తులకు సిద్ధపడ్డామని, 2024లో మాత్రం అలా జరగరాదని కేంద్ర బీజేపీ నాయకత్వం పట్టుబట్టి కూర్చుంది అంటున్నారు. ఒకవేళ టీడీపీతో పొత్తు అంటే మాత్రం ఈసారి భారీగా డిమాండ్ చేసి లబ్ది పొందాలన్న ఆలోచనలు కూడా ఉన్నట్లుగా తెలుస్తోంది. అంటే పాతిక అసెంబ్లీ సీట్లు పది దాకా ఎంపీ సీట్లు తీసుకోవాలని బీజేపీ చూస్తోంది. దీని వెనక ఉద్దేశ్యం ఏమిటి అంటే ఈసారి ఏపీలో కూటమి అధికారంలోకి వస్తే తాము కూడా కీలక భాగస్వామిగా ఉండాలన్నది. అంటే బీజేపీ జాతీయ స్థాయిలో పెద్దలు ఏపీలో రాజకీయ అవకాశాలను ఈసరి కచ్చితంగా వాడుకోవాలని చూస్తున్నారు. గతంలో మాదిరిగా లైట్ తీసుకోవడంలేదు అని అంటున్నారు. ఇక చూస్తే మోడీ అమిత్ షాకు ఏపీ ప్రతిష్టగా మారింది అని అంటున్నారు. ఈ ఇద్దరూ 2014లో కేంద్రంలో బీజేపీని అధికారంలోకి తెచ్చాక ఈశాన్య రాష్టాన నుంచి అనేక చోట్ల అధికారం బీజేపీ సొంతం అయింది కానీ 1983 కంటే ముందు ఉమ్మడి ఏపీలో బలంగా ఉన్న బీజేపీకి విభజన ఏపీలో ఆ వైభోగం నాలుగు దశాబ్దాలు దాటినా తీసుకుని రాలేకపోయారు అన్న బాధ ఉంది. దాంతో ఈ టెర్మ్ కూడా కేంద్రంలో మోడీ ప్రధాని అవుతారు అని వార్తలు వస్తున్న టైం లో ఆయన ఇమేజ్ ని అలా వాడుకుంటూ ఏపీలో బీజేపీ అధికారంలోకి తీసుకుని రావాలి అన్నదే ఆ పార్టీ పెద్దల ఆలోచంగా ఉంది. మరి పొత్తులు పెట్టుకుని కొన్ని సీట్లలో పోటీ చేసి మిత్రుల మద్దతుతో ఎమ్మెల్యేలు ఎంపీలు కావాలన్న బీజేపీ ఏపీ నేతల ఆశలకు బీజేపీ పెద్దల వ్యూహాలకు మధ్య తెలియని అగాధం అయితే ఏర్పడింది. మరి ఈ చిక్కు ముడి ఎలా వీడుతుందో చూడాల్సిందే.

# కళా వేడుకలు.. కరవైన వేదికలు



కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాలయం ఆవరణలో కళాభారతి మూతపడటంతో సరైన వేదికలు లేకుండా పోయాయి. నాలుగైదు ఏళ్లుగా కళా నైపుణ్యాలు వెలికితీసే పోటీలు కరవయ్యాయి. కళాభారతి అందుబాటులో ఉన్నప్పుడు వివిధ కళా సంస్థలు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించేవి. జిల్లావాసులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లడానికి ఆ వేదికలు దోహదపడేవి. కళా వేదికలు లేకపోవడంతో పోటీలు లేవు.. ప్రతిభ చూపే కళాకారులు లేకుండాపోయారు.

పోటీలు నిర్వహించలేక...

ప్రతి ఏటా బాల కేంద్రం దాదాపు 500 మంది చిన్నారులకు వివిధ కళల్లో శిక్షణ ఇస్తోంది. వేసవి శిబిరం ముగిసిన తర్వాత వారి ప్రతిభ చాటేందుకు వేదిక లేకుండాపోయింది. వైశ్యభవన్, కలెక్టరేట్ ఆడిటోరియం తదితర చోట నిర్వహించుకోవాల్సిన పరిస్థితి. ఇటీవల ఒక సంస్థ నటన, నృత్యం, పాటల పోటీలకు చిన్నారుల నుంచి అర్జీలు ఆహ్వానిస్తే దాదాపు 200పైగా వచ్చాయి. వీరికి పోటీలు నిర్వహించేందుకు వేదిక కనిపించలేదు. కలెక్టరేట్ ఆడిటోరియం, వైశ్యభవన్‌లో అవకాశమున్నా.. ఖర్చుతో కూడుకున్నదని ఆ సంస్థ నిర్వాహకులు వాపోయారు కృషిభవన్‌ను ఎంచుకొని పోటీలు నిర్వహించారు.

400కు పైగా శిక్షణ సంస్థలు

ఉమ్మడి జిల్లాలో వివిధ కళా పోషణ శిక్షణ, నిర్వహణ సంస్థలు దాదాపు నాలుగు వందలకు పైగా ఉన్నాయి. ఇటీవల మహిళలు డప్పు వాయిద్యం, కోలాటం, వివిధ కళారూపాలు నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో, రాజకీయ సమావేశాల్లో కళారూపాల ప్రదర్శనలు విధిగా ఏర్పాటు చేస్తున్నారు. కళల ప్రదర్శనకు చక్కని వేదికంటూ ఉండాలని కొన్నేళ్ల నుంచి కళా సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి.

రూ.14 కోట్లతో..

జిల్లాలో కళారంగానికి పెద్ద పీట వేయాలని గత ప్రభుత్వం కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో అమృతవర్షిణి పేరుతో మినీ రవీంద్రభారతికి శ్రీకారం చుట్టింది. దీనికి పద్మ పురస్కారం గ్రహీత ప్రముఖ సంస్కృత పండితుడు శ్రీభాష్యం విజయసారథి పేరు పెట్టారు. ముఖ్యమంత్రి అస్యూరెన్స్, పట్టణ ప్రగతి పద్దు కింద రూ.14 కోట్లు కేటాయించారు. ఇందులో రెండు ఆడిటోరియంలు నిర్మించాలని భావించారు. రెండేళ్ల కిందట ప్రారంభమైన నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఎలక్ట్రికల్, సౌండ్, తదితర పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఏడాది నుంచి ఎలా ఉందో ఇప్పటికీ అలాగే దర్శనమిస్తోంది. పనులు మెల్లగా నడుస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా రాజకీయ పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు కరీంనగర్ మినీ రవీంద్రభారతి త్వరితగతిన పూర్తి చేసేందుకు చొరవ చూపాలని కోరుతున్నారు.

పనులు నడుస్తున్నాయి

కళల సౌధం నిర్మించాలనే మినీ రవీంద్ర భారతి పనులు ప్రారంభించాం. వివిధ పద్దుల కింద రూ.14 కోట్లు కేటాయించారు. ఆడిటోరియం గదుల నిర్మాణం పూర్తయింది. ఇటీవల పనులు కొంచెం మెల్లగా నడుస్తున్నాయి. సకాలంలో కూలీలు లేక.. రాక కొంత జాప్యం జరుగుతోంది. పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

యాదగిరి సునీల్‌రావు, నగర మేయర్

కళాకారుల్లో సన్నగిల్లిన ఆసక్తి

కళా ప్రదర్శనలు.. శిక్షణలకు.. పోటీలకు సరైన వేదికంటూ లేకపోవడంతో ఆసక్తి సన్నగిల్లింది. గత జనవరి నాటికే మినీ రవీంద్రభారతి పూర్తి కావాల్సి ఉండేది. మరో ఆరు నెలలైనా పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. కొత్త ప్రభుత్వం పెద్దలు చొరవ చూపి మినీ రవీంద్ర భారతిని వినియోగంలోకి వచ్చేలా చూడాలని ఆశిస్తున్నాం.

జి.కృపాదానం, రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, ఫోక్ ఆర్ట్స్ అకాడమీ

# కాలువ గట్లపై కరెంటు తయారీ



పెద్దపల్లి : సాధారణంగా గుట్టల పైనుంచి జాలువారే జలపాతాలు, ప్రాజెక్టుల నుంచి దూకే నీటి వేగ తీవ్రతను విద్యుత్తు శక్తిగా మార్చేందుకు జల విద్యుత్తు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. దేశంలోని భారీ జల విద్యుత్తు కేంద్రాలన్నీ అలాంటి ప్రాంతాల్లోనే కేంద్రీకృతమయ్యాయి. సాధారణ ప్రవాహంలోని గతి శక్తిని యాంత్రిక శక్తిగా మార్చి విద్యుత్తును తయారు చేసే మినీ హైడల్ కేంద్రాలు పెద్దపల్లి పట్టణానికే తలమానికంగా మారాయి. ఎస్సారెస్పీ డి–83 కాలువ ఆధారంగా ఇక్కడ విద్యుదుత్పత్తి జరుగుతోంది. తాజాగా ఈ కాలువపైనే సౌర విద్యుత్తు తయారీ కోసం ఫలకల ఏర్పాటుకు జెన్‌కో కార్యాచరణ చేపట్టింది. ఇప్పటివరకు నాలుగు కేంద్రాల్లో సౌర ఫలకల ఏర్పాటుకు ప్రభుత్వం సాంకేతిక అనుమతులు మంజూరు చేసింది.

ఇక్కడే ఎందుకు..!ఎస్సారెస్పీ కాలువల్లో సాధారణంగా పంటలు విత్తుకునే సమయం నుంచి కోతల వరకు మాత్రమే నీటి సరఫరా జరుగుతుంది. వేసవితో పాటు ఇతర సమయాల్లో దాదాపు సరఫరా పూర్తిగా నిలిచిపోతుంది. కానీ డి–83 కాలువ ద్వారా రామగుండం ఎన్టీపీసీకి నిరంతరం నీటి సరఫరా చేయాల్సి ఉంటుంది. దీంతో ఈ కాలువ ద్వారా ఏడాది పొడవునా నీరు ప్రవహించేది. దీంతో 1986లో ఈ కాలువపై జెన్‌కో సంస్థ మినీ హైడల్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 1987లో ఉత్పత్తి ప్రారంభమైంది. కానీ ఎల్లంపల్లి ప్రాజెక్టు అందుబాటులోకి రావడంతో ఎస్సారెస్పీ నుంచి ఎన్టీపీసీకి నీటి విడుదల నిలిచిపోయింది. ఫలితంగా కాలువపై ఏర్పాటు చేసిన విద్యుత్తు కేంద్రాల ఉత్పత్తి సామర్థ్యం కూడా తగ్గిపోయింది. ఈ పరిస్థితుల్లో నీటి ప్రవాహం లేని సమయంలో విద్యుత్తు ఉత్పాదకతను పెంచేందుకు జెన్‌కో సౌర విద్యుత్తు కేంద్రాల ఏర్పాటుకు ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం 6వ, 7వ, 12, 14వ మైలురాయి వద్ద సౌరఫలకల ఏర్పాటుకు సంబంధించిన సివిల్ పనులు జరుగుతున్నాయి.

9.16 మెగావాట్ల సామర్థ్యం

ఎస్సారెస్పీ కాకతీయ కాలువకు సంబంధించి చొప్పదండి మండలం రేవెల్లి వద్ద ఉన్న డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో 83వ కెనాల్ ప్రధానమైంది. ఇది ధర్మారం మండలం పత్తిపాక సమీపంలో పెద్దపల్లి జిల్లాలో ప్రవేశిస్తుంది. ఈ కాలువపై ధర్మారం మండలం కమ్మర్‌ఖాన్‌పేట నుంచి పెద్దపల్లి పురపాలిక పరిధిలోని చందపల్లి వరకు 10 మినీ హైడల్ విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో 2 నుంచి 3 యూనిట్లు పని చేస్తున్నాయి. వీటి పూర్తి సామర్థ్యం 9.16 మెగావాట్లు కాగా నీటి లభ్యత తక్కువగా ఉండటంతో విద్యుత్తు ఉత్పత్తి కూడా తక్కువగానే జరుగుతోంది. గడిచిన అయిదేళ్లలో 2022–23 ఆర్థిక సంవత్సరంలోనే అత్యధికంగా 9.16 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించింది. గత పదేళ్లలో ఇదే అత్యధిక ఉత్పాదకత. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 2.89 మిలియన్ యూనిట్ల విద్యుత్తు మాత్రమే ఉత్పత్తి జరిగింది. కాలువలో నీటి ప్రవాహం తక్కువ రోజులు ఉండటంతో పాటు పలు యూనిట్లకు మరమ్మతు అవసరమై ఉత్పత్తి తగ్గింది.

# సంక్షేమ బాట.. రెండింట ఊరట..

ఆదిలాబాద్ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మరో రెండు పథకాలకు శ్రీకారం చుట్టారు. మార్చి నుంచి 200 యూనిట్ల లోపు విద్యుత్తును వినియోగించుకునే వారికి జీరో బిల్లు వస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. అర్హులైన లబ్ధిదారులు గడిచిన మూడేళ్లలో వాడిన గ్యాస్ సిలిండర్ల సగటును పరిగణనలోకి తీసుకుని.. రాయితీ సిలిండర్లకు సంబంధించి నగదు బదిలీపై పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో గృహజ్యోతికి అధికారుల అంచనా మేరకు 6.98 లక్షలు అర్హులు కాగా, మహాలక్ష్మి పథకంతో 3.50 లక్షల మంది లబ్ధి పొందే అవకాశం ఉంది.

విద్యుత్తు వినియోగదారులకు మేలు..ఉచిత విద్యుత్తుకు సంబంధించిన గృహజ్యోతి పథకానికి 6.26 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దరఖాస్తుదారులతో పాటు విద్యుత్తు శాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి అర్హుల వివరాలు నమోదు చేయగా 6.98 లక్షల మంది ఉన్నట్లు తేలింది. అధికారుల లెక్కల మేరకు జిల్లాలో 200 యూనిట్ల లోపు విద్యుత్తును వినియోగించే వారు 80 శాతం మంది ఉండే అవకాశం ఉందని తేలింది. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారికి కూడా ప్రభుత్వం దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చింది. నెల వారీగా బిల్లులు ఇచ్చే సిబ్బంది గతంలో మాదిరిగానే ఇంటికి వచ్చి విద్యుత్తు వినియోగం లెక్కలు తీస్తారు. 200 యూనిట్లలోపు ఉంటే జీరో బిల్లు వస్తుందని అధికారులు తెలిపారు. జీరో బిల్లు వస్తే సగటున రూ.900 వరకు ప్రయోజనం కలుగుతుందని అధికారులు అంటున్నారు.

మూడేళ్ల సగటు..

జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారంగా 9.32 లక్షల మంది వినియోగదారులు ఉన్నారు. ప్రజాపాలనలో రూ.500 సిలిండర్ కోసం 7.34 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. తాజా మార్గదర్శకాల మేరకు గడిచిన మూడేళ్లలో వాడిన గ్యాస్ సిలిండర్ల సగటును పరిగణనలోకి తీసుకుంటే రాయితీ సిలిండర్లు పొందడానికి 3.50 లక్షల మంది ఉన్నట్లుగా లెక్కలు తేల్చారు. గ్యాస్ వినియోగదారులు గతంలో మాదిరిగా సిలిండర్‌ను మొత్తం ధర చెల్లించి తీసుకుంటే రూ.500 పోనూ మిగిలిన రాయితీ సొమ్మును వినియోగదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రాయితీ సొమ్మును నేరుగా వినియోగదారుల ఖాతాల్లో జమ చేస్తోంది. అదే మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం కూడా నగదు బదిలీ పద్ధతిలో రాయితీ సొమ్మును వినియోగదారుల ఖాతాల్లో జమ చేయనుంది.

# అభివృద్ధికి ఆటంకం

సూర్యాపేట : గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచుల పాలన ఈ ఏడాది జనవరితో ముగిసింది. ఎన్నికలకు ఎలాంటి ప్రకటన రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక అధికారులను నియమించి పాలన కొనసాగిస్తుంది. పంచాయతీల్లో అభివృద్ధి, ఇతర కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రతి నెల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే 15 ఫైనాన్స్ కింద పీఎఫ్ఎంఎస్, ఎస్ఎఫ్‌సీ, జనరల్ ఫండ్ నిధులు కేటాయిస్తున్నాయి. వీటిని గతంలో సర్పంచులు, ఉప సర్పంచులు వారి చెక్ పవర్ ద్వారా అవసరం మేరకు వినియోగించుకునే వారు. ప్రస్తుతం ఆ చెక్ పవర్‌ను ప్రత్యేక అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వాల్సి ఉంది. కానీ వీరిని నియమించి నెల రోజులు కావొస్తున్నా.. నేటికీ ఆ చెక్ పవర్ కేటాయించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పీఎఫ్ఎంఎస్ నిధులు సంబంధించి డిజిటల్ కీ ఇవ్వాల్సి ఉండగా.. నేటికీ ఇవ్వకపోవడంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది. సొంతంగా ఖర్చు.. ఉమ్మడి జిల్లాలో 1740 గ్రామ పంచాయతీలున్నాయి. ఆయా పంచాయతీల్లో ప్రతి రోజు పారిశుద్ధ్యం, ట్రాక్టర్ డీజిల్, బ్లీచింగ్ పౌడర్, వేసవి నేపథ్యంలో తరచూ మోటార్ల మరమ్మతులు, వీధిలైట్ల ఏర్పాటు తదితర వాటికి పంచాయతీ కార్యదర్శులు సొంతంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. చిన్న నుంచి మేజర్ గ్రామ పంచాయతీల్లో




ఇప్పటికే రూ.25–30 వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. వీటికి తోడు ప్రభుత్వం అప్పగించిన పారిశుద్ధ్య వారోత్సవాలను సైతం ఎలాంటి సమస్యలు తలెత్తకుండా విజయవంతం చేశారు. కొందరు జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు గత నెల వేతనాలు మంజూరు కాలేదు. అభివృద్ధి పనులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం విద్యుత్తు బిల్లు, ట్రాక్టర్ కిస్తీలకు, కార్మికులకు అత్యవసరం కాగా వెంటనే మంజూరు చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

సురేశ్, డీపీవో, సూర్యాపేట

ప్రత్యేక అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు జాయింట్ చెక్ ఇవ్వాల్సి ఉంది. ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూస్తాం.

# మూడు పార్టీలకు ప్రాధాన్యం

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ మున్సిపాల్టీకి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీయూఎఫ్ఐడీసీ) నుంచి మంజూరైన రూ.50 కోట్ల నిధులపై పేచీ నెలకొనడం ఉత్కంఠకు దారితీసింది. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఈ పనులు ప్రారంభం కాకపోవడంతో మార్పులు చేర్పులతో ప్రభుత్వం మళ్లీ ప్రతిపాదనలు కోరింది. అసెంబ్లీ స్థానం గెలుపొందిన భాజపా, ఇటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, మున్సిపాల్టీలో పాగా వేసిన భారాస మూడు పార్టీలు ఈ పనులకోసం పట్టుబట్టాయి. చివరకు బదిలీ అయిన కలెక్టర్ రాహుల్‌రాజ్ మూడు పార్టీలకు దాదాపు సరిసమానంగా పనులు కేటాయించి సంబంధిత కార్పొరేషన్‌కు ప్రతిపాదనలు పంపడంతో ఉత్కంఠకు తెరపడింది.

పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన కోసం గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన టీయూఎఫ్ఐడీసీ రుణం కింద నిధులు మంజూరు చేస్తుంది. స్థానిక ఎమ్మెల్యే సూచనతో జిల్లా కలెక్టర్ నుంచి కార్పొరేషన్ ఎండీకి ప్రతిపాదనలు పంపించాలనేది నిబంధన. గతంలో ఆదిలాబాద్ మున్సిపాల్టీకి సంబంధించి అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న పట్టణంలో మురుగు కాలువలు, కల్వర్టులు, సీసీ రోడ్ల పనుల కోసం రూ.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. మొత్తం 73 పనుల కోసం రెండేళ్ల కిందట ఈ నివేదిక పంపించినా మొన్నటి ఎన్నికల కంటే ముందు అంటే 22.09.2023న మంజూరు లభించింది. టెండర్ల నిర్వహణకు సమయం లేకపోవడం.. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆ పనులు మొదలుకాలేదు.



భిన్న రాజకీయ పరిస్థితులతో ఉత్కంఠ

కొత్త ప్రభుత్వం వీటిపై ఆరా తీసి మళ్లీ ప్రతిపాదనలు కోరింది. ఆదిలాబాద్‌లో భిన్నమైన రాజకీయ పరిస్థితులు ఉండటం అధికారులకు కాస్త ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం ఇక్కడ భాజపా తరఫున ఎమ్మెల్యేగా పాయల్ శంకర్ గెలుపొందారు. ఆదిలాబాద్ మున్సిపల్ ఛైర్మన్‌గా భారాసకు చెందిన మాజీ మంత్రి జోగు రామన్న కుమారుడు జోగు ప్రేమేందర్ కొనసాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే లేని చోట ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు సూచించిన పనులు కేటాయిస్తున్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి వర్గీయులు తమకు సంబంధించిన వార్డుల్లో కొత్త పనులు ప్రతిపాదించారు. ఎమ్మెల్యే పనులు సూచించాలనే ఆదేశాలతో భాజపా ఎమ్మెల్యే శంకర్ సైతం పనులతో నివేదిక ఇచ్చారు. మార్పులు చేర్పులు చేసి కొత్త పనులతో ప్రతిపాదనలన్నీ జిల్లా కలెక్టర్ నుంచే కార్పొరేషన్‌కు పంపించాలి. ఇక్కడ మూడు పార్టీల నుంచి సూచనలు రావడంతో కలెక్టర్ ఆ దస్త్రాన్నే ముట్టుకోలేదని సమాచారం. చివరకు ఆయన బదిలీపై వెళుతున్న నేపథ్యంలో ఈ పనులపై సమీక్షించినట్లు తెలిసింది. గతంలో ఉన్న కొన్ని పనులను అలాగే ఉంచి మరికొన్ని చోట్ల కొత్త పనులు, కొత్తవార్డులను చేర్చారు. మూడు పార్టీలకు ప్రాధాన్యమిచ్చేలా ప్రతిపాదనలు వెళ్లినట్లు తెలిసింది.

# రాని నిధులు.. అసంపూర్తిగా పనులు

గంగాధర : గంగాధర మండలం ఉప్పరమల్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా వదిలేసిన డైనింగు హాల్ భవనం. 10 నెలల కిందట రూ.13 లక్షలతో ప్రారంభించగా.. రూ.5.37 లక్షల పనులు మాత్రమే చేశారు. దీనికి సంబంధించి ఎంబీ రికార్డు చేసి ప్రభుత్వానికి పంపించినా రూపాయి మంజూరు కాలేదు. ఒద్యారం, మల్లాపూర్, గంగాధర, బూర్గుపల్లి, కురిక్యాల పాఠశాలల్లో నిధులు రాక పనులు పూర్తవక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది గర్శకుర్తి ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదుల భవనం. అదనపు తరగతి గదులకు రూ.18 లక్షలు, వంటగది, బాలికల మూత్రశాలలకు రూ.3 లక్షలు కేటాయించగా.. 90 శాతం పనులు పూర్తయినా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి విడుదల అవ్వలేదని గుత్తేదారు వాపోయారు. జడ్పీ పాఠశాలలో రూ.20 లక్షల విలువగల డైనింగ్‌హాల్ పూర్తి చేయగా.. రూ.4.50 లక్షలు మాత్రమే మంజూరయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలన్నా ఉద్దేశంతో సర్కారు అమలు చేస్తున్న 'మన ఊరు-మన బడి' కార్యక్రమం ఆరంభశూరత్వంగా మారింది. నిధుల విడుదలలో జాప్యం ఏర్పడి పనులు ముందుకు సాగడం లేదు. ఈ



విద్యాసంవత్సరం కంటే ముందే పనులకు అప్పటి ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేసి ఆరు నెలల్లో పూర్తి చేసి విద్యార్థులకు వసతులు సమకూర్చాలని నిర్ణయించినా చాలా పాఠశాలల్లో పనులు పూర్తికాలేదు. మొదటి విడతలో జిల్లాలోని 230 పాఠశాలల పనులకు రూ.93.42 కోట్ల నిధులు కేటాయించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. చేసిన పనులకు అంతే మొత్తంలో నిధులు విడుదల కాలేదు. గత ప్రభుత్వ హయాంలో పథకం అమలు కాగా ఇటీవలి ఎన్నికల నియామవళి, ప్రభుత్వం మారడం, నిధుల కొరత ఈ పథకానికి ప్రతిబంధకంగా మారిందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అప్పులు చేసి పనులు చేశామని గుత్తేదారులు విద్యా కమిటీ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

# సేవలకు.. శతాబ్ది ఉత్సవం

నల్గొండ : భారతీయ సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడుతూ.. బ్రిటీష్ పాలన నుంచి విముక్తి కోసం ప్రజలను ఏకం చేయడానికి ఏర్పడిన ఆర్యసమాజం నల్గొండలో వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఆర్యసమాజ కార్యక్రమాలకు ఆకర్షితులైన కొంత మంది నల్గొండలో 1920లో దీనిని ఏర్పాటు చేశారు. దీంతో మార్చి ఒకటో తేదీ నుంచి 3 వరకు ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆర్య సమాజాన్ని ఏర్పాటు చేసిన మహనీయుడు మహర్షి దయానంద సరస్వతి ద్వి శతజయంతి ఉత్సవాలను శతాబ్ది ఉత్సవాలతో కలిపి నల్గొండలోని ఆర్యసమాజములో నిర్వహించనున్నారు. వారు నల్గొండ జిల్లాలో ఉచిత విద్యతోపాటు యోగా, ధ్యానం, కర్రసాము, సాంస్కృతిక కార్యక్రమాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆదర్శంగా వివాహాలు నిర్వహించే సంప్రదాయం ఉన్నా.. ఆర్య సమాజం ఇచ్చే ధ్రువీకరణకు చట్టబద్ధత లేదని కోర్టు ఇచ్చిన తీర్పుతో వివాహాల నిర్వహణకు బ్రేక్ పడింది. వందేళ్ల ఉత్సవాలకు యోగా గురువు రాందేవ్ బాబాతో సహా దేశం నలుమూలల వందలాది మంది ప్రతినిధులు హాజరుకానున్నారు.

ఉత్సవాలు విజయవంతం చేయాలి

నీలగిరి, న్యూస్‌టుడే: నల్గొండలో ఆర్య సమాజం ఏర్పాటు చేసి వందేళు పూర్తి చేసుకున్న సందర్భంగా మార్చి 1 నుంచి 3వరకు నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని ఆర్యసమాజము ప్రతినిధి సభ తెలంగాణ అధ్యక్షుడు విఠల్‌రావు కోరారు. బుధవారం ఆర్య సమాజం మందిరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మన ధర్మాలను



కాపాడుకుంటూ ప్రకృతిని రక్షించుకునే విధంగా నిత్య యజ్ఞం నిర్వహిస్తున్నామని తెలిపారు. యోగా గురువు రామ్‌దేవ్ బాబా మార్చి 2న నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని సందేశం ఇస్తారని తెలిపారు. వేద పండితులు 200 యజ్ఞ కుండల్లో మూడు రోజులు యజ్ఞం నిర్వహిస్తారని తెలిపారు. దేశం నలుమూలల నుంచి వచ్చే వారితో పట్టణంలో నగరోత్సవ యాత్ర నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో భారత్ స్వాభిమాన్ ట్రస్టు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రావు, పతాంజలి రాష్ట్ర అధ్యక్షుడు శివుడు, భారత్ స్వాభిమాన్ నాయకులు శివకుమార్, ఆర్య సమాజము నల్గొండ అధ్యక్ష కార్యదర్శులు బోయపల్లి కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముందు తరానికి స్ఫూర్తి కలిగించేలా..

బోయపల్లి కృష్ణారెడ్డి, అధ్యక్షుడు, ఆర్యసమాజం

ఏ విలువల కోసం సమాజం ఏర్పడిందో.. దాన్ని కొనసాగిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నాం. సమాజం ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మహర్షి 200 జయంతి సందర్భంగా 200 కుండలాలతో మహా యజ్ఞం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. కంప్యూటర్ యుగంలోను సమాజములో చేరి సేవ చేయడానికి ముందుకొస్తున్న యువతను అభినందిస్తున్నాం. ముందు తరానికి స్ఫూర్తి కలిగించే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశాం.

# అక్రమాల సూత్రదారులు తేలేదెన్నడో



కరీంనగర్ : గొర్రెల కొనుగోలు పథకంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అనేక అక్రమాలు జరిగాయి. నాలుగు జిల్లాల పరిధిలో లబ్ధిదారులకు చేరాల్సిన యూనిట్లు లారీల కొద్దీ మాయమయ్యాయి. పలు చోట్ల రాయితీ కింద అందాల్సిన మూగజీవాలు పక్కదారి పట్టగా పోలీసులు పట్టుకున్నారు. అధికారులు, దళారులు, వ్యాపారుల అక్రమాలపై కేసులు నమోదయ్యాయి.

అక్రమాలపై పలు చోట్ల విచారణలు జరిగినా చాలా చోట్ల అటకెక్కడంతో బాధ్యులు బయటపడలేదు. కొందరు అధికారులపై బదిలీ వేటు పడింది. అయినా నాలుగు జిల్లాల పరిధిలో గోల్‌మాల్ బాగోతం ఇష్టారాజ్యంగా నడిచింది. దీనివెనుక పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయి. ఆయా జిల్లాల్లో పథకం ప్రారంభమైనప్పటి నుంచి మూడేళ్ల పరిస్థితిని 'కాగ్' తన నివేదికలో తేటతెల్లం చేసింది. ఈ అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పక్కదారి పట్టిన గొర్రెలు, మాయమైన మూగజీవాలపై సమగ్ర విచారణ జరిపితే కోట్లాది రూపాయల అవినీతి బట్టబయలయ్యే అవకాశముంది.

మొక్కుబడి తంతుగానే..

కరీంనగర్ జిల్లాలో నాలుగేళ్ల కిందట ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే రూ.7.50 కోట్ల విలువైన గొర్రెలను కొనుగోలు చేసి తెచ్చి లబ్ధిదారులకు ఇచ్చినట్లు చెప్పిన కట్టుకథలపై అప్పటి కలెక్టర్ విచారణ జరిపించారు.

మానకొండూర్ సహా పలు మండలాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ఎంపీడీవోలు పంపిణీ చేసిన వాటిలో 85 శాతం మాయమయ్యాయని నివేదిక ఇవ్వడం అప్పట్లో సంచలనం రేకెత్తించింది.

కొందరు అధికారులపై చర్యలు తీసుకున్నా, మొక్కుబడి తంతుగానే మిగిలింది. నాటి కలెక్టర్ ఈ మొత్తాన్ని వ్యాపారులకు చెల్లించవద్దని ఆదేశాలిచ్చారు. అయితే ఆ మొత్తాన్ని చెల్లించారా? లేదా? అనేది అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు.

2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాల్లో కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన గొర్రెలను లబ్ధిదారులకు అందించిన వెంటనే తిరిగి లారీల్లో తరలించిన ఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నాయి.

కొందరు పశు వైద్యాధికారులు ఈ అక్రమాల్లో భాగమైనట్లు ఆరోపణలు వచ్చాయి. పథకం అమలు విషయంలో భారీగా నగదు చేతులు మారింది. దళారులతో చేతులు కలిపిన కొందరు లారీల కొద్దీ గొర్రెలను మాయం చేశారు. రాయికల్, సారంగాపూర్ మండలాల్లో మహారాష్ట్రకు వెళ్తున్న వాహనాలను అక్కడి పోలీసులు పట్టుకున్నారు.

జమ్మికుంట మండలం కోరపల్లికి చెందిన 20 యూనిట్లు పక్కదారి పట్టగా, తర్వాత గంగాధర, చొప్పదండి, హుజూరాబాద్ ప్రాంతాల్లో గొర్రెలు పట్టుబడ్డాయి.

2018 మార్చి 13న ఉమ్మడి జిల్లాకు చెందిన 232 గొర్రెలు జోగులాంబ గద్వాల జిల్లాలో పట్టుబడ్డాయి. హుజూరాబాద్ మండలం ధర్మరాజ్‌పల్లి నుంచి 10 లారీల్లో గొర్రెలను కర్నూలు జిల్లా డోన్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారు.

మల్యాల మండలం లంబాడిపల్లిలో 118 గొర్రెలను లారీలో తరలిస్తుండగా పట్టుకున్నారు. అడపాదడపా వ్యాపారులపై కేసులు పెట్టినా ఈ అక్రమం ఆగలేదు. 2018 మార్చిలో గోదావరిఖనిలో ముగ్గురు వ్యాపారులపై కేసు పెట్టారు.

# స్వయం సమృద్ధి.. అతివల ఆర్థికాభివృద్ధి



పెద్దపల్లి : జిల్లాలో స్వయం సహాయక సంఘాల్లోని మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ ఏడాది బ్యాంకు రుణాల పంపిణీలో అగ్రపథంలో నిలిచింది. మరో నెలరోజుల గడువు మిగిలి ఉండగానే శతశాతం పూర్తి చేరువలో ఉంది. రోజు వారీగా అధికారులు రుణాల ప్రగతిపై చర్చిస్తూ లోపాలను అధిగమిస్తున్నారు. రెండేళ్లుగా నిర్దేశించిన లక్ష్యాల కంటే మరోసారి పెంచడంతో ప్రగతి కష్టంగా మారింది. కొన్ని చోట్ల రుణాలు తీసుకునేందుకు మహిళలు ఆసక్తి చూపడంలేదు. అధికారులు బలవంతంగా కట్టబెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణం..

గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో సంఘాల పొదుపు కొలమానంగా రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలు రుణం పొందుతున్నారు. ఈ ఏడాది మహిళల్లో మరింత ఆర్థికాభివృద్ధి పెంచేందుకు కొన్ని బ్యాంకులు ప్రత్యేక రుణాలు ఇస్తున్నాయి. దీంతో కిరాణం, కంగన్‌హాల్, వస్త్ర దుకాణాలు, పిండి గిర్నీ, బేకరి, విస్తరాకులు, వస్త్ర, జనపనార, పుట్టగొడుగులు తయారీ, వ్యవసాయం, పిల్లల చదువులు, కుటీర పరిశ్రమ వ్యాపారాల్లో రాణిస్తున్నారు. వడ్డీ వ్యాపారుల బెడద లేకుండా రుణాలు తీసుకొని తిరిగి కిస్తీలు చెల్లిస్తున్నారు. రుణాలు తీసుకున్న కొందరు సభ్యులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో రికవరీ కష్టసాధ్యంగా మారింది.

సమీక్షిస్తూ.. పురోగతి సాధిస్తూ

జిల్లాలో రుణ లక్ష్యాలు చేరుకునేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. 18 ఏళ్లు నిండిన మహిళలను సంఘాల్లో సభ్యులుగా చేర్పిస్తున్నారు. గ్రామ స్థాయిలో సీఏ మొదలుకొని సీసీలు, ఏపీఎం, డీపీఎలు సమీక్షిస్తున్నారు. ఒకసారి పొందిన రుణాలు మూడేళ్లలోపు వాయిదా పద్ధతిలో చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో ఈ ఏడాది 7,435 సంఘాలకు రూ. 398.18 కోట్లు లక్ష్యం ఉండగా.. ఇప్పటి వరకు 8,718 సంఘాలకు రూ.383.88 కోట్లతో 96.41 శాతం ప్రగతి సాధించారు. జిల్లాలో లక్ష్యాల కంటే అత్యధికంగా ధర్మారంలో 832 సంఘాలకు రూ.43.84 కోట్లకు రూ.63.24 కోట్లు, ఓదెలలో రూ.33.21 కోట్లకు రూ.41.78 కోట్లు, రామగిరిలో 29.60 కోట్లకు రూ.36.89 కోట్లు పంపిణీ చేశారు.

# అదనపు టీఎంసీ కాలువ పనులు సాగేనా?



సిరిసిల్ల : శ్రీరాంసాగర్ వరద కాలువ ద్వారా మధ్యమానేరు జలాశయానికి ఏటా 20 టీఎంసీలు తరలించే సామర్థ్యం ఉంది. దీనికి సమాంతరంగా రామడుగు నుంచి మరో కాలువ తవ్వుతున్నారు. ఇదే కాళేశ్వరం నుంచి అదనపు టీఎంసీ ఎత్తిపోతలు కాలువ పనులు ఏడాదిగా ముందుకు సాగడం లేదు. ఇటీవల కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అదనపు టీఎంసీ కాలువ పనులపై కేంద్ర జల వనరుల సంఘం (సీడబ్ల్యూసీ) అభ్యంతరం తెలిపింది. అదనపు టీఎంసీ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేయడం సమర్థనీయంగా లేదని, దీనిపై వెచ్చించే ఖర్చు- ప్రయోజనం (కాస్ట్-బెనిఫిట్) నిష్పత్తిలో తేడా పెరుగుతుందని వివరించింది. పైగా 2022 నుంచి దీనిపై సీడబ్ల్యూసీ అప్పటి ప్రభుత్వంపై పలు సందేహాలు లేవనెత్తింది. దానికి వారి నుంచి ఎలాంటి సమాధానాలు రాలేదు. ఇవన్నీ ఒక కారణమైతే మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల కుంగుబాటుతో ఈ పనులపై పూర్తిగా నీలినీడలు కమ్ముకున్నాయి. అదనపు టీఎంసీ ఎత్తిపోతల కోసం మేడిగడ్డ, అన్నారం పంపుహౌజ్‌లలో ఇప్పటికే మోటార్లు కూడా బిగించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో మేడిగడ్డ, అన్నారంలో ప్రభుత్వం ఎన్‌డీఆర్ బృందం పరిశీలన, తర్వాత జరిగిన పరిణామాలతో అదనపు టీఎంసీ పనులపై సందిగ్ధత నెలకొంది. కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా మధ్యమానేరుకు రోజుకు 2 టీఎంసీలు తరలించేలా వరద కాలువ ఉంది. దీనితో సంబంధం లేకుండా అదనపు టీఎంసీని తరలించేలా రూ.34,810 కోట్లతో పనులు చేపట్టాలని 2022లో నిర్ణయించారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గాయత్రి పంపుహౌజ్ నుంచి మధ్యమానేరు వరకు 23 కిలోమీటర్ల మేరకు రెండు ప్యాకేజీలుగా కాలువను తవ్వాలి. దీనిలో 15 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. ఇంకా ఎనిమిది కిలోమీటర్ల తవ్వకం పనులు ముందుకు సాగలేదు. గ్రామాల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోవడమే ఇందుకు కారణం. ఆరు నెలలకు పైగా నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో గుత్తేదారు పనులు చేయని పరిస్థితి ఉంది.

మధ్యమానేరు జలాశయం కుడివైపు కాళేశ్వరం పదో ప్యాకేజీ అప్రోచ్ కాలువకు సమీపంలో అదనపు టీఎంసీ కోసం మరో కాలువను తవ్వారు. దీనికి కొంతదూరంలో ఇల్లంతకుంట మండలం వెల్జిపూర్ వద్ద పంపుహౌజ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి కొండపోచమ్మ వరకు పనులు నాలుగు ప్యాకేజీలుగా ఉన్నాయి. దీనిలో మధ్యమానేరు నుంచి అన్నపూర్ణ జలాశయం వరకు సుమారు 75 శాతం పూర్తయ్యాయి. రూ.3 వేల కోట్ల వరకు పనులు పూర్తయ్యాయి. వెల్జిపూర్ పంపుహౌజ్‌లో విద్యుద్దీకరణ, మోటార్ల బిగింపు మిగిలాయి. ఇక్కడి నుంచి మూడు దశల పనులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. మధ్యమానేరులో అయిదు టీఎంసీల నీటి నిల్వ ఉన్న ఈ ప్యాకేజీ ద్వారా నీరు తరలించే వెసులుబాటు ఉంది.

నిర్వాసితుల అయోమయం

వరద కాలువకు సమాంతరంగా తవ్వుతున్న అదనపు టీఎంసీ కాలువ కోసం రామడుగు, గంగాధర, బోయినపల్లి మండలాల్లో భూసేకరణ ప్రక్రియ అసంపూర్తిగా ఉంది. విలాసాగర్, వరదవెల్లి, రత్నంపేట తదితర గ్రామాల్లో పరిహారం చెల్లింపునకు కొందరు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దేశాయిపల్లిలోని ఇళ్లకు గెజిట్‌ను కూడా ప్రచురించారు. కొన్ని గ్రామాల్లో రైతులకు పరిహారం సైతం పంపిణీ చేశారు. పనులు నిలిచిపోవడంతో అసంపూర్తి భూసేకరణ, పరిహారం చెల్లింపులతో నిర్వాసితులు అయోమయంలో పడ్డారు.

# రుణ సాయం.. ప్రధాన సమస్యల పరిష్కారం

గోదావరిఖని : రామగుండం నగరపాలక ప్రాంతాభివృద్ధికి టి.యు.ఎఫ్.ఐ.డి.సి.(తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) ద్వారా రెండు విడతలుగా రూ.100 కోట్లు రుణసాయం అందించనున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలోని ప్రధాన సమస్యలు పరిష్కారం కానున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శాసనసభ ఎన్నికలకు ముందుగా అప్పటి ప్రభుత్వం హడావుడిగా రామగుండం అభివృద్ధికి టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధులు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈలోగా ఎన్నికల ప్రక్రియతో తెరపడింది. ఎన్నికల తంతు ముగిశాక రామగుండం అభివృద్ధి నిధుల కోసం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దృష్టి సారించారు. పురపాలక నిర్వహణ శాఖతో పాటు టి.యు.ఎఫ్.ఐ.డి.సి. ఉన్నతాధికారులను కలిసి నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరడంతో దస్త్రాలకు కదలిక వచ్చింది. రెండు విడతలుగా టి.యు.ఎఫ్.ఐ.డి..సి. నిధులు రూ. 100 కోట్లు విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయా నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అంచనాలు సిద్ధం చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. డి.పి.ఆర్. తయారీ కోసం రెండు రోజుల క్రితం క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయగా అంచనాలు సిద్ధం చేస్తున్నారు. నిధులు భారీగాఉన్న నేపథ్యంలో ప్రధాన మురుగు కాలువల నిర్మాణంపై



నగరపాలక అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డివిజన్లలో చేపట్టాల్సిన పనులకు ఇతర నిధులు కేటాయించేలా దృష్టి సారిస్తూ టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధులతో నగరంలో నిర్మాణానికి నోచుకోని ప్రధాన మురుగు కాలువలు నిర్మించాల్సి ఉంది.

డి.ఎం.ఎఫ్.టి. నిధులు రూ.10 కోట్లు

ఈ ప్రాంతంలోని వివిధ పరిశ్రమలు ప్రభుత్వానికి చెల్లించే నిధులతో స్థానికంగానే అభివృద్ధి పనులు చేపట్టాలనే నినాదంతో ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే మొదటగా డి..ఎం.ఎఫ్.టి.(డిస్ట్రిక్టు మినరల్ ఫౌండేషన్ ట్రస్టు) నిధులపై దృష్టి సారించారు. ఎట్టకేలకు రామగుండం అభివృద్ధి కోసం డి.ఎం.ఎఫ్.టి.నిధులు రూ.10 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నగరంలోని వివిధ ప్రాంతాల ప్రజలకు ఉపయోగపడేలా ప్రధాన వ్యాపార కూడలి లక్ష్మీనగర్ ప్రాంతంలో ఈ నిధులతో భూగర్భ మురుగు కాలువలు, రహదారుల నిర్మాణానికి రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు ఇటీవల ప్రజారోగ్య శాఖ ఇంజినీర్లు లక్ష్మీనగర్ ప్రాంతంలో క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయగా అంచనాలు సిద్ధం చేస్తున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి. అత్యవసరంగా ప్రజా సమస్యల పరిష్కారం, నిధుల కొరతతో అర్థాంతరంగా ఆగిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు ఈ నిధులను వినియోగించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# మందుల పల్లె.. ఉపాధికి సిరిమల్లె

నల్గొండ : ఉమ్మడి జిల్లాలో ఫార్మా విలేజ్ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. తాజాగా నల్గొండలో ఫార్మా విలేజ్‌ను నెలకొల్పుతామని ప్రభుత్వం ప్రకటించడంతో క్షేత్రస్థాయిలో కదలిక మొదలైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఫార్మా కంపెనీలు ఉన్న ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఫార్మా విలేజ్ ఏర్పాటుతో ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు రానున్నాయి. ప్రస్తుతం నల్గొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లో చిన్నవి, పెద్దవి కలిపి సుమారు వంద వరకు పరిశ్రమలున్నాయి. ఇందులో 30 వేలకు పైగా కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. ఔషధ రంగంలో దేశంలోనే పేరున్న డాక్టర్ రెడ్డీస్,దివిస్, సువెన్ ఫార్మాలతో పాటూ చిన్న, పెద్ద కంపెనీలు అనేకం ఉమ్మడి జిల్లాలో 20 ఏళ్ల క్రితమే కంపెనీలు ఏర్పాటు చేశాయి. దాదాపు 50 శాతానికి పైగా కంపెనీలు, ఉపాధి అవకాశాలు ఒక్క చౌటుప్పల్ ప్రాంతంలోనే ఉన్నాయి. ఇక్కడే గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేసి అందులోనే ఫార్మా విలేజ్‌లకు కావాల్సిన మౌలికవసతులు కల్పించాలని సర్కారు ప్రాథమికంగా నిర్ణయించింది. మరోవైపు చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోనే గత ప్రభుత్వం సుమారు రెండు వేల ఎకరాల్లో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో కొన్ని కంపెనీలు ఇప్పటికే ఉత్పత్తులు ప్రారంభించగా..మరికొన్ని పరిశ్రమలు త్వరలోనే తమ ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాయి. హైదరాబాద్ సమీపంలోని శామీర్‌పేటలో రెండు దశాబ్దాల క్రితం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏర్పాటు చేసిన జీనోమ్‌వ్యాలీ లాగా ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేసి అన్ని కంపెనీలను ఒకే దగ్గర స్థాపించేలా, వాటికి కావాల్సిన వసతులను ప్రభుత్వమే కల్పించేలా అంకురార్పణ చేయనున్నారు. అయితే దీని ఏర్పాటుకు ఇప్పటి వరకు తమకు ఎలాంటి రాతపూర్వక ఆదేశాలు అందలేదని సంబంధిత అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వ భూముల లభ్యతపై ఆరా

నల్గొండ జిల్లాలో ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ ప్రకటించినా.. ఏ ప్రాంతంలో అనేది స్పష్టత లేదు. అయితే రవాణా సదుపాయాలు, హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లోనే వీటిని ఏర్పాటు చేసే అవకాశమున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీని స్థాపనకు సుమారు 100 ఎకరాల వరకు అవసరమున్న నేపథ్యంలో ఆ మొత్తంలో ఉమ్మడి జిల్లాలో ఏ ప్రాంతంలో ఒకే చోట భూలభ్యత ఉంది అనే దానిపై ఆరా తీయాలని నల్గొండ, యాదాద్రి జిల్లాల రెవెన్యూ యంత్రాంగాలకు ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. బీబీనగర్, బొమ్మలరామారం, చౌటుప్పల్, తుర్కపల్లి, చిట్యాల మండలాల పరిధితో పాటూ హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి పక్కన ఉన్న స్థలాలను అధికారులు పరిశీలిస్తున్నారు. మరోవైపు ఈ క్లస్టర్ ఏర్పాటుతో ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.




# గ్రూప్స్ పరీక్షల తేదీలు ఖరారు

హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వ కొలువుల కోసం సన్నద్ధమవుతున్న విద్యార్థులకు కీలక అప్‌డేట్ వచ్చింది. ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తోన్న గ్రూప్– 1 గ్రూప్–2, గ్రూప్– 3 పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఈ పరీక్షల తేదీలను టీఎస్‌పీఎస్సీ బుధవారం మధ్యాహ్నం విడుదల చేసింది. 563 ఉద్యోగాల భర్తీకి ఇటీవల విడుదల చేసిన గ్రూప్ –1 నోటిఫికేషన్‌కు సంబంధించి జూన్ 9న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ.. అక్టోబర్ 21 నుంచి గ్రూప్ –1 మెయిన్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు తాజాగా వెల్లడించింది. అలాగే, మొత్తం 783 గ్రూప్– 2 పోస్టుల భర్తీకి ఆగస్టు 7, 8 తేదీల్లో పరీక్షలు నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. ఇకపోతే, 1,388 గ్రూప్ –3 ఉద్యోగాల భర్తీకి రాత పరీక్షలు నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఓ ప్రకటనలో తెలిపారు. గ్రూప్– 1 ఉద్యోగాలకు మార్చి 14వరకు దరఖాస్తులు స్వీకరణ కొనసాగనుండగా.. గ్రూప్ –2 ఉద్యోగాలకు 5.51లక్షల మంది, గ్రూప్ 3 పోస్టులకు సైతం 5లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే.

# ఎల్ఆర్ఎస్‌పై భగ్గుమన్న బీఆర్ఎస్.. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు







హైదరాబాద్ : గతంలో ఎల్ఆర్ఎస్ వద్దు, భూములను ఉచితంగా క్రమబద్ధీకరిస్తామన్న కాంగ్రెస్ పార్టీ నేడు మాట తప్పడంపై బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నారు. నాడు అడ్డగోలుగా మాట్లాడిన నేటి కాంగ్రెస్ మంత్రులు, ఇప్పుడు నోరు ఎందుకు విప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్ఆర్ఎస్ అంటే ప్రజల నుంచి డబ్బులు దోచుకోవడమే అన్న కాంగ్రెస్ నేతలు..ఇప్పుడు ప్రజల నుంచి ఎందుకు డబ్బులు దోపిడీ చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఎల్ఆర్ఎస్‌ను నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ధర్నాలు, రాస్తారోకోలతో హోరెత్తించారు. నాడు ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలని డిమాండ్ చేశారు. ఉచితంగా అమలు చేసే వరకు ప్రజల తరఫున ప్రభుత్వంపై పోరాడుతామని నినదించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు.. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఛార్జీలు లేకుండా ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలని కోరుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు, జిల్లా కేంద్రాల్లో గులాబీ పార్టీ నేతలు ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. అలాగే, హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ, హెచ్‌డీఎంఏ కార్యాలయాల వద్ద నిరసనలు తెలుపుతున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి, సీతక్క మాట్లాడిన మాటలను బీఆర్ఎస్ నేతలు గుర్తుచ చేస్తున్నారు. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారమే 25 లక్షల కుటుంబాలకు ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో ప్రజల నుంచి 20వేల కోట్లు వసూలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని గులాబీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ నిరసనల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు, నేతలు ఉన్నారు. అమీర్‌పేటలోని మైత్రివనం హెచ్ఎండీఏ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ ధర్నాలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

**తలసాని కిరణ్ వినూత్న నిరసన..** అమీర్‌పేటలోని HMDA కార్యాలయం ముందు బీఆర్ఎస్ నేత తలసాని సాయి కిరణ్ వినూత్న నిరసన చేపట్టారు. వాటర్ బాబిల్స్‌తో హెచ్ఎండీఏ ముందు నిరసన. ఈ క్రమంలో హెచ్ఎండీఏ సిబ్బందికి వాటర్ బాటిల్స్ పంపిణీ చేసిన కిరణ్. తాను ఇచ్చిన నీళ్లు తాగి ప్రశాంతంగా ఎల్ఆర్ఎస్ రద్దు అంశం ఆలోచించాలని కోరిన కిరణ్. ఈ సందర్భంగా తలసాని కిరణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై భారం మోపాలని చూస్తోంది. ఎల్ఆర్ఎస్ వల్ల ప్రజలు ఇబ్బందులు పడతారు. గత ప్రభుత్వాన్ని విమర్శించిన నాయకులు ఇప్పుడెందుకు ఎల్ఆర్ఎస్ అమలు చేస్తున్నారు అని ప్రశ్నించారు.

# డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు.. మినాక్సిటాప్ భారీగా లభ్యం



హైదరాబాద్: తెలంగాణలో డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు నిర్వహిస్తున్నారు. నల్గొండలో సాయిరామ్ ఫార్మా అండ్ సర్జికల్స్‌లో తనిఖీ చేసి మినోక్సిటాప్ 10% అనే డ్రగ్‌ను అధికారులు సీజ్ చేశారు. కొత్త వెంట్రుకలు పెరగడానికి ఈ మందును అమ్ముతున్నారు, వినియోగదారులను తప్పుదారి పట్టించినందుకు స్వాధీనం చేసుకున్నారు. హీలింగ్ ఫార్మా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మినాక్సీటాప్ 10% తయారు చేస్తుంది. ఈ మెడిసిన్ వెంట్రుకలు తిరిగి పెరగడానికి ఉపయోగపడుతుందని.. ఇది తిరిగి పెరగడాన్ని ప్రేరేపించడానికి వెంట్రుకల కుదుళ్లను తిరిగి సక్రియం చేస్తుందని ప్రచారం చేస్తూ మెడిసిన్ అమ్ముతున్నారు. డీసీఏ అధికారులు దాడుల్లో మినాక్సీటాప్ 10% నిల్వలు పెద్ద ఎత్తున లభ్యమయ్యాయి.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194



# రైతులకు తియ్యటి కబురు...

## డబ్బులు చెల్లించనున్న రాష్ట్ర ప్రభుత్వం

కేంద్ర ప్రభుత్వ పంటల బీమా పథకం 'ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన'లో రైతుల వాటాను తెలంగాణ ప్రభుత్వమే చెల్లించబోతోంది. దీనికి సంబంధించిన వివరాలను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రైతునేస్తం పథకంలో భాగంగా 2024 వర్షాకాలం నుంచి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలుచేయనున్నట్లు మంత్రి తెలిపారు. రైతులు పండించే అన్ని పంటలకు ఇది వర్తిస్తుందన్నారు. ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకంలో రాష్ట్ర రాయితీతోపాటు రైతల వాటా ప్రీమియాన్ని కూడా ప్రభుత్వమే భరించనుందన్నారు. పంట నష్టపోయిన సందర్భాల్లో పరిహారం చెల్లింపులు ఆలస్యంగా జరిగేవని, కొన్ని సందర్భాల్లో 2 నుంచి 3 సంవత్సరాల సమయం కూడా పట్టిందన్నారు. ఇకనుంచి అటువంటి సమస్య తలెత్తదని, క్రాపిక్, విండ్స్, ఎస్ టెక్ లాంటి టెక్నాలజీద్వారా శాటిలైట్ ఇమేజరీ అప్లికేషన్లు, డేటాను ఉపయోగించి పంట దిగుబడులను, పంట నష్టాలను తక్షణమే నిర్ధారిస్తారన్నారు. ఆ తర్వాత వెంటనే నగదు బదిలీ అవుతుందన్నారు. ఐటీ హబ్ లో ఒక్కరికి ఒక్కక్యాన్ మాత్రమే తాగునీరు, ఆ వాటర్ క్యాన్ ను మడతపెట్టి?, దేవుడా! ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకం 2016 నుంచి అమల్లోకి వచ్చింది. 2016 నుంచి 2020 వరకు రాష్ట్రంలో ఈ పథకం అమలైనప్పటికీ రైతులకు అనుకూలంగా లేదనే కారణంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం నుంచి బయటకు వచ్చింది. 2020 నుంచి తెలంగాణలో ఎటువంటి పంటల బీమా అమలవలేదు. ఏదో ఒక బీమా పథకం ఉంటే మంచిదనే భావన అందరి రైతుల్లో నెలకొంది. నాలుగు రోజుల క్రితమే రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకంలో చేరింది. వచ్చే పంటల కాలం నుంచి రైతులు బీమా పొందనున్నారు.

# బీజేపీ నేతలతో టచ్‌లో హరీష్‌రావు: కోమటిరెడ్డి వ్యాఖ్యలు



యాదాద్రి భువనగిరి: పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు బీజేపీ చేరుతారని జోస్యం చెప్పారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. ఈ మేరకు హరీష్‌రావు బీజేపీ నేతలతో సంప్రదింపులు చేస్తున్నాడని అన్నారు. దీంతో, ఆయన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. కాగా, భువనగిరిలో మంత్రి కోమటిరెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ..'బీఆర్ఎస్‌లో ప్రతిపక్ష నాయకుడి హోదా కేసీఆర్ తన కొడుకు కేటీఆర్‌కు ఇస్తే అల్లుడు హరీష్ పార్టీ నుంచి బయటకు వెళ్తాడు.. అలాగే, అల్లుడికి ఇస్తే కొడుకు బయటకు వెళ్లిపోతాడు. ఇందులో భాగంగానే హరీష్‌రావు బీజేపీ నేతలతో ఇప్పటికే సంప్రదింపులు చేస్తున్నాడని తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎదుర్కొనే శక్తి మాజీ సీఎం కేసీఆర్‌కు లేదు. అందుకే కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు. మీలాగా ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటే బీఆర్ఎస్‌లో మిగిలేది నలుగురే. ప్రధానమంత్రి రాష్ట్రానికి వస్తే ఆయనను కలిసి వినతి పత్రం ఇవ్వాలి. కానీ, కేసీఆర్ మాత్రం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కలిశాడని ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో ఎల్ఆర్ఎస్‌పై కోమటిరెడ్డి స్పందిస్తూ ఎల్ఆర్ఎస్‌పై గైడ్ లైన్స్ ఇంకా పూర్తి కాలేదు. అలాగే, తెలంగాణ నుంచి రాహుల్ గాంధీ పోటీ చేస్తే మోదీ కంటే ఎక్కువ మెజార్టీ వస్తుంది' అంటూ ఆసక్తికర కామెంట్స్ చేశారు.

# ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా మరమ్మతులతోపాటు చర్యలు: ఉత్తమ్




హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టును పరిశీలించేందుకు రాష్ట్రానికి వచ్చిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) కమిటీతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అధికారులు సమావేశమయ్యారు. ఎన్‌డీఎస్‌ఏ కమిటీకి పూర్తిగా సహకరిస్తామని, ప్రాథమిక నివేదిక వీలైనంత త్వరగా ఇవ్వాలని కమిటీని మంత్రి ఉత్తమ్ కోరారు.

నివేదిక ఆధారంగా మరమ్మతులతోపాటు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. "మోదీ విధానాల వల్లే దేశంలో నీటిపారుదల ప్రాజెక్టుల్లో అవినీతి జరుగుతోంది. కాళేశ్వరం భారాసకు ఏటీఎంగా మారటానికి మోదీ విధానాలే కారణం. కార్పొరేషన్ల ద్వారా భారాస ప్రభుత్వం రూ.84వేల కోట్ల రుణం తీసుకుంది. మమ్మల్ని విమర్శించే అర్హత భాజపాకు లేదు"అని ఉత్తమ్ అన్నారు.

# ఆర్ఎస్‌పీ ఎఫెక్ట్.. బీఆర్ఎస్‌లో మరో వికెట్ ఔట్..!



తెలంగాణలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు బీఆర్ఎస్‌ను వీడగా.. ఇప్పుడు మరో కీలక నేత పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. గత ఎన్నికల్లో కోనప్పపై బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ పోటీ చేశారు. తన ఓటమికి ప్రవీణ్ కుమార్ కూడా కారణమనే భావన కోనప్పలో ఉంది. ఈ క్రమంలో పార్టీ అధినేత కేసీఆర్ తనతో కనీసం మాట మాత్రమైనా చెప్పకుండా పొత్తు నిర్ణయం తీసుకున్నారని అసంతృప్తితో ఉన్నారు. ఇవాళ హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు కోనేరు కోనప్ప. మంగళవారం నాడు తన అనుచరులతో రహస్య సమావేశం నిర్వహించిన కోనేరు కోనప్ప.. ఇప్పుడు ఏకంగా సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఇవాళో రేపో పార్టీకి రాజీనామా చేయాలని భావిస్తున్నారు కోనప్ప. అనంతరం ఈ నెల 12వ తేదీన గానీ.. 15వ తేదీన గానీ కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారట. కోనేరు కోనప్ప బీఆర్ఎస్ పార్టీని వీడటానికి ప్రధాన కారణం బీఎస్పీతో పొత్తు పెట్టుకోవడమే అని ఆయన అనుచరులు చెబుతున్నారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తరువాత పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే పలువురు సిట్టింగ్ ఎంపీలు ఇతర పార్టీల్లో చేరుతుండగా.. మరికొందరు ఎమ్మెల్యేలు సైతం బీజేపీ, కాంగ్రెస్‌తో మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తుంది. క్షేత్రస్థాయిలో నేతలు ఇప్పటికే జెండా మార్చేశారు. ఇప్పుడు ఎమ్మెల్యేలు, ఎంపీలు పక్క చూపులు చూస్తున్నారు. మరి పార్లమెంట్ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలి.

# వందరోజుల పాలనలో ఏమైంది?.. కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలి?

హైదరాబాద్, మార్చి 6: సీఎం రేవంత్ వంద రోజుల పాలన చూసి కాంగ్రెస్‌కు ఓటెయ్యండి అని అంటున్నారని.. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో ఏమైందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. "కాషాయ పేపర్‌పై మోడీకి లవ్ లెటర్ రాసిండు. కాంగ్రెస్‌ను కూడా మోసం చేసిండు. రాహుల్ అధానిని తిడితే సీఎం రేవంత్ అలై బలై తీసుకున్నారు. మళ్లీ మోదీయే ప్రధాని అవుతారు అన్నట్లుగా రేవంత్ మాట్లాడారు. రాహుల్ గాంధీయే ప్రధాని అవుతే మోదీ అవసరం ఏముంది నీకు. దేశంలో కాంగ్రెస్ గెలవదని చెప్పకనే చెప్పిండు. రాహుల్ గాంధీ గుజరాత్ మోడల్ నిరంకుశమైనదని చెబుతున్నారు. ఆ గుజరాత్ మోడల్ కావాలని రేవంత్ అంటున్నారు. రాహుల్, సోనియా ఆశీర్వాదం కంటే మోదీ ఆశీర్వాదం కోసం ఎక్కువ ప్రయాస పడుతున్నారు" అంటూ వ్యాఖ్యలు చేశారు. వందరోజుల్లో చేస్తామన్న హామీలు అమలు చేస్తేనే ఓటు అడిగే హక్కు ఉంటుందన్నారు. 2లక్షల రుణమాఫీ, 15వేల రైతు భరోసా, 24గంటల ఉచిత కరెంట్ ఇవ్వకుండా మాట తప్పారన్నారు. వడ్లకు బోనస్ ఇస్తామన్నారని.. కానీ ఇవ్వలేదన్నారు. ఏవీ ఇవ్వకుండా కాంగ్రెస్ ఎలా ఓటు అడుగుతుందని ప్రశ్నించారు. ట్యాంకర్‌లు పెట్టి పొలాలకు నీళ్లు పట్టించే దుస్థితి వచ్చిందన్నారు. రైతులను ఇబ్బంది పెడుతున్న రేవంత్ పాలనకు ఎందుకు ఓటు వేయాలో ప్రజలు, రైతులు, రైతు కూలీలు నిర్ణయం తీసుకోవాలన్నారు. 4వేల పెన్షన్ ఇవ్వకుండా మోసం చేసిన పాలనకు గుణపాఠం చెప్పాలన్నారు. 4వేల పెన్షన్ ఇస్తామని బాండ్ పేపర్ రాసిచ్చిన కాంగ్రెస్‌పై కేసు పెట్టాలని అన్నారు. ఎల్ఆర్ఎస్ ఫ్రీ గా చేస్తామని చెప్పి మాట తప్పినందుకు ఓటు వేయాలా అని ప్రశ్నించారు. దళిత బంధు ఇవ్వనందుకు దళితులు నిర్ణయం తీసుకోవాలని హరీష్‌రావు వ్యాఖ్యలు చేశారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660